ఒంటిస్తంభంపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

● ఇళ్ల చుట్టుపక్కల ఏర్పాటుకు అంగీకరించని స్థానికులు ● పరిమిత స్థలంలో ఏర్పాటుకు విద్యుత్ అధికారుల చర్యలు



గడ్డిఅన్నారంలో ఒంటిస్తంభంపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చాదర్‌ఘాట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరాఫరాకు ఆటంకం కలుగొద్దు.. కానీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రం మా ఇంటి చుట్టుపక్కల ఏర్పాటు చేయొద్దు. ఇది మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలోని ఇళ్ల యజమానుల తీరు. ఇలాంటి ఇబ్బందికరమైన, అభ్యంతరాల నడుమ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం విద్యుత్ అధికారులకు కత్తి మీద సాములా మారింది. దీంతో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే ఒంటిస్తంభంపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు మలక్‌పేట విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు.

ఆరు ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు, మూడు చోట్ల ఏర్పాటు

మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలో కొత్తగా మంజూరైన ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఒంటి స్తంభాలపై ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు మంజూరైనా, అనువైన స్థలం లేకపోవడంతో ఒకింత జాప్యం జరుగుతోంది. విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను పరిష్కరించలేకపోతున్నారు. తాజాగా పరిమిత స్థలంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదనల్లో ప్రధానాంశం. ఈ మేరకు సలీంనగర్, ఆస్మాన్‌ఘడ్, సైదాబాద్ సెక్షన్ల పరిధులో ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఒంటిస్తంభంపైనే ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే ఆస్మాన్‌ఘడ్ సెక్షన్ పరిధిలోని గడ్డిఅన్నారంలో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒంటిస్తంభంపై ఏర్పాటు చేయగా, సలీంనగర్ సెక్షన్‌లో రెండు ఏర్పాటు చేశారు. సైదాబాద్ సెక్షన్ పరిధిలో రెండు, ఆస్మాన్‌ఘడ్ సెక్షన్‌లో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించాల్సి ఉంది.

ఇక ముందు ట్రాన్స్‌ఫార్మర్లన్నీ ఒంటి స్తంభంపైనే



ఇరుకైన వీధులు, బస్తీల్లోను మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా ఇక మునుముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లన్నింటిని ఒంటి స్తంభంపైనే ఏర్పాటు చేయనున్నాం. 11 మీటర్ల ఎత్తైన ఒంటి స్తంభంపై 160కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఒంటి స్తంభంపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఏర్పాటుతో పరిమిత స్థలంతోపాటు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశముంది.

- విష్ణువర్ధన్‌రెడ్డి, డీఈ, ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్



ఎన్‌క్లేవ్ కాలనీలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

చంపాపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చంపాపేట డివిజన్‌లోని శిఖర ఎన్‌క్లేవ్ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.29 లక్షలతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సాయిరాం నగర్‌కాలనీ మీదుగా శిఖర ఎన్‌క్లేవ్ కాలనీ, పటేల్‌నగర్ వరకు ప్రధాన రహదారిపై 120 మిల్లీమీటర్ల డయామీటర్ వెడల్పులో ఆర్‌సీసీ పైపులైన్ ద్వారా సాఫీగా వరదనీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పనులు పూర్తి అయిన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రఘుపతిగౌడ్, కాలనీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సదానంద్‌రెడ్డి, కృపాచారి, సత్యం, నాయకులు జగదీష్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

మల్లికార్జుననగర్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

వనస్థలిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. వనస్థలిపురం డివిజన్ మల్లికార్జుననగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

హయత్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని సూర్యానగర్ కాలనీలోని పార్కు అభివృద్ధిలో భాగంగా బోరు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పార్కు అభివృద్ధి జరగాలని అన్నారు. అందులో భాగంగానే బోరు వేసి మిగతా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యానగర్ కాలనీ ఈస్ట్ అధ్యక్షుడు యాదగిరిగౌడ్, యాదగిరిరెడ్డి, యాదగిరిచారి, దశరథరెడ్డి, రాజ వర్ధన్‌రెడ్డి, ఎర్రవెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు ప్యాచ్‌వర్క్ చేయండి

కొత్తపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన రహదారులకు కనీసం ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ సరూర్‌నగర్ సర్కిల్ -5 డీసీ భువనగిరి శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన డీసీని కలిసి కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. గాయత్రీపురం నుంచి ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ వరకు వరదనీటి కాల్వ పనులకు రూ.5 కోట్లు మంజూరయ్యాయని గుర్తు చేశారు. త్వరగా కాల్వ పనులు చేపట్టాలని, సీటీఓ కాలనీ- మోహన్‌నగర్, గాయత్రీపురం- ఎస్‌ఆర్‌ఎల్ కాలనీల అంతర్గతదారులు పాడయ్యాయన్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని డీసీని ఆయన కోరారు.



డీసీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సురేంద్రనాథ్ యాదవ్

స్వచ్ఛ నాగోల్‌కు ప్రజలంతా సహకరించాలి

మన్సూరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇళ్లతో పాటు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ డివిజన్ ప్రజలంతా 'స్వచ్ఛ నాగోల్'కు సహకరించాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రనాథ్‌యాదవ్ కోరారు. డివిజన్ పరిధిలోని జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీ ఈస్ట్‌లో స్వచ్ఛ నాగోల్‌పై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు, నివాసితులతో కలిసి ఆయన రోడ్లపై, ఇళ్ల పరిసరాల్లో చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ, కాలనీ అధ్యక్షుడు సంతోష్, సభ్యులు ప్రశాంత్, రవి, అశోక్, సందీప్, సాయి, సంగీత, నాగరాజు, ఎన్.రవి తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న

వనస్థలిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ టి.మహేష్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లో శ్రీ మల్లికార్జున భక్త సమాజం అధ్యక్షుడు ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు శివ మాలాధారణ స్వాముల అన్నదాన కార్యక్రమానికి వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ మహేష్ ముఖ్య అతిథిగా హాజరై సోమవారం శివ స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ వంతుగా సమాజ శ్రేయస్సుకు కృషి చెయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, కాలనీవాసులు పాల్గొన్నారు.



శివ స్వాములకు అన్నం వడ్డిస్తున్న ఇన్‌స్పెక్టర్ మహేష్, సతీష్‌కుమార్ గౌడ్

ఉపగ్రహ ప్రయోగాలలో మిధాని పాత్ర కీలకం

● రిటైర్డ్ ఐపీఎస్ లక్ష్మీనారాయణ

చంపాపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇస్రో చేపడుతున్న స్వదేశీ ఉపగ్రహ ప్రయోగాలతో పాటు గగన్‌యాన్, చంద్రయాన్, మిస్సైల్స్ తయారీలో మిధాని పాత్ర ఎంతో కీలకమని రిటైర్డ్ ఐపీఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్‌లో నిర్వహించిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025 వారోత్సవాల ముగింపు సమావేశం సోమవారం మిధానిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ హాజరై విజిలెన్స్ సీవీవో స్ఫూర్తిరెడ్డి, మిధాని డైరెక్టర్(ఉత్పత్తి, మార్కెటింగ్) పద విట్టన్ బాబుతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మెటలార్జికల్ ఉత్పత్తులలో మిధాని ఎంతో పేరు గాంచిందని అన్నారు. మిధాని ఉత్పత్తులు భారత్‌కు అందించడంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతులు చేయడం పట్ల ఆయన ఉద్యోగులను అభినందించారు. దేశం ఎకానామిక్, టెక్నికల్, కల్చరల్, పొలిటికల్ సూపర్‌పవర్‌గా ఎదగాలంటే విద్యార్థుల పాత్ర కీలకమని ఆయన అన్నారు. అనంతరం లక్ష్మీనారాయణ జాగృతి మ్యాగ్జిన్‌ను ఆవిష్కరించారు. వారోత్సవాలను పురష్కరించుకొని మిధాని టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలలో గెలుపొందిన విజేతలకు లక్ష్మీనారాయణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిధానిలోని వివిధ విభాగాల ఏజీఎం, జీఎం, ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ లక్ష్మీనారాయణ తదితరులు

ఇళ్ల మధ్యలో ఎస్టీపీ నిర్మించొద్దు

● కుంట్లూర్‌లో ప్లాంట్ ప్రతిపాదనను విరమించుకోవాలి

● అధికారులతో సమీప కాలనీవాసుల వాగ్వాదం, నిరసన

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ సర్వే నంబర్ 107లో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సమీప కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సదరు సర్వే నంబర్‌లో 9 ఎకరాల ప్రభుత్వ భూమిని హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీకి కేటాయించింది. సోమవారం సంబంధిత శాఖ అధికారులు కుంట్లూర్‌లోని ప్రభుత్వం కేటాయించిన స్థలం వద్దకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జూబ్లీనగర్, కనకదుర్గానగర్, ప్రజయ్‌గుల్మోర్, భవానీనగర్, షిర్డీ సాయినగర్, రాఘవేంద్రనగర్ కాలనీ వాసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఇళ్ల మధ్యలో ఎస్టీపీని ఏలా ఏర్పాటు చేస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిరసన వ్యక్తం చేయడంతో అధికారుల అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఆయా కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఎస్టీపీ ప్రతిపాదన నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. పదుల సంఖ్యలో కాలనీలు వెలసిన చోటా.. కనీసం ప్రజా అభిప్రాయ సేకరణ కూడా చేయకుండా ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన ఎస్టీపీని ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సమీప కాలనీ ప్రజలందరం వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీ వాసులు రవికుమార్, సుధాకర్‌రెడ్డి, పురుషోత్తం, పరమేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, మురళీ, జోర్కా రాముముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎస్టీపీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న ఆయా కాలనీల ప్రజలు

మురుగు ముంచేస్తున్నా పట్టించుకోరా?

● హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి

● కుంగిపోయిన మ్యాన్‌హోల్ వద్ద నిరసన

హయత్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా మురుగునీరు కాలనీలను ముంచేస్తున్నా పట్టించుకోరా అని జలమండలి అధికారులను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి ప్రశ్నించారు. సమస్యను జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని సోమవారం పద్మావతి కాలనీలో కుంగిపోయిన మ్యాన్‌హోల్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి తిరుమల్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ డివిజన్‌లో ఎక్కడ చూసినా మురుగునీటి పైపులు పగిలిపోయి దర్శనమిస్తున్నాయని అన్నారు. నెలలు గడుస్తున్నా సమస్యను పరిష్కరించడం లేదని అన్నారు. స్థానిక కార్పొరేటర్ సైతం ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు. పద్మావతి కాలనీ, సామనగర్‌లో ఇళ్లు మొత్తం మురుగునీటిలో ఉన్నాయని, ఇళ్లలోని బోర్లు, హయత్‌నగర్‌లోని రెండు చెరువులు కుమ్మరి కుంట, బాతుల చెరువు మొత్తం మురుగునీటితో నిండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి మురుగు సమ్యను పరిష్కరించకుంటే బాధిత కాలనీవాసులతో కలిసి జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు గుడాల మల్లేష్ ముదిరాజ్, వెంకటాచారితో పాటు పలువురు పాల్గొన్నారు.



పద్మావతికాలనీలో కుంగిన మ్యాన్‌హోల్ వద్ద నిరసన తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

బీసీ బిల్లుకు అడ్డుపడుతున్న బీజేపీ

● సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య

హయత్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లుకు అడ్డు పడుతోందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.యాదయ్య ఆరోపించారు. సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హయత్‌నగర్‌లో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాదయ్య హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చంద్రమోహన్, నాయకులు నర్సిరెడ్డి, నరహరి, సంధ్య, మల్లేశం, అనీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

హయత్‌నగర్‌లోని పద్మావతి కాలనీ, సామనగర్ కాలనీలో రోడ్లపై మురుగునీరు పారకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం సర్కిల్ కార్యదర్శి నర్సిరెడ్డి కోరారు. సోమవారం నర్సిరెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు హెచ్‌ఎండబ్ల్యూఎస్, సివరేజ్ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ మురుగునీటి సమస్యపై ఫిర్యాదు చేసి 20 రోజులు అయినా ఎక్కడి సమస్య అక్కడే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొత్త గణేష్‌గౌడ్, భూషన్, నరహరి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత వాహన ప్రయాణం కోసమే ట్రాఫిక్ నిబంధనలు

కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సురక్షిత వాహన ప్రయాణానికి ట్రాఫిక్ నిబంధనల అమలు తప్పనిసరి అని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి తెలిపారు. సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై 474 మంది వాహనదారులకు టీటీఐ అధికారులు రామంతాపూర్, హబ్సిగూడ తదితర 8 ప్రాంతాల్లో టీటీఐ ఆర్‌ఎస్‌ఐ సంతోష్ కుమార్, ఎస్‌ఐ నర్సింహారావు, సిబ్బంది రమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అర్జున్ రాచపుడి మాట్లాడుతూ రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలనూ వివరించారు.

94 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడపడం అందరికీ ప్రమాదకరమేనని టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్‌పీఓలు అమరవర్ధన్‌రెడ్డి, అల్లూరయ్య వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో పట్టుబడిన 94 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు, టీటీఐ లెక్చర్‌హాల్స్‌లో 7 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ నర్సింహారావు, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రమేష్ ఆధ్వర్యంలో సందేశాత్మక గీతాలు, మద్యంమత్తులో వాహనాలు నడపడంతో జరిగిన ప్రమాదాల వీడియో క్లిప్పులను, మద్యం ప్రియుల్లో మార్పును కోరుతూ ప్రముఖుల సందేశాలనూ ప్రదర్శించారు.



మద్యం ప్రియులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ అర్జున్



రమేష్‌కు ఆర్థిక సాయం అందజేసిన స్నేహితులు

మిత్రుడికి ఆపదలో అండగా..

● వైద్య ఖర్చులకు రూ. 50 వేలు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్నేహం అంటే ఆనందంలోనే కాదు.. ఆపద సమయంలో కూడా అండగా నిలబడతామని నిరూపించారు బాటసింగారం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామానికి చెందిన ఇట్టమోని రమేష్ ఇటీవల పక్షపాతం బారిన పడడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న బాటసింగారం జడ్పీహెచ్‌ఎస్ 2000-01 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరూ కలిసి తమ స్నేహితుడి వైద్య ఖర్చుల కోసం రూ.50 వేలను సేకరించి సోమవారం రమేష్ ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ఎడ్ల మహారాజ్, దుర్గం నరేష్, గండు జంగయ్యయాదవ్, మారగోని శ్రీనివాస్, దయాకర్‌రెడ్డి, మోడెపు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల సేకరణ

సంతోష్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ సరూర్‌నగర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వినియోగదారుల సర్వీస్ సెంటర్లలో పరిష్కారం కాని సమస్యలను. దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్యలతో పాటు బిల్లులో హెచ్చుతగ్గుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, టెక్నికల్ ఇంజనీర్ రాజారాంరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ రమణారెడ్డి, ఏడీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈలు హనుమంతు, విజయభాస్కర్ పాల్గొన్నారు.



కాశీవిశ్వేశ్వరుడికి బిల్వ, పుష్పార్చన చేస్తున్న దుర్గాదేవి ఆలయ చైర్మన్ గణేష్‌యాదవ్, భక్తులు

కాశీవిశ్వేశ్వరుడికి కార్తీక మాస పూజలు

మన్సూరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసాన నాగోల్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలోని ఆలయాలు, ముఖ్యంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని నాగోల్ డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలో గల శ్రీదుర్గా దేవిఆలయంలోని కాశీవిశ్వేశ్వరుడి ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పండితులు చల్లా బాలమురళీకృష్ణ శర్మ వేద మంత్రోచ్చరణల నడుమ స్వామివారికి బిల్వ, పుష్పార్చనలతో పాటు పలు విశేష పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

కంఠమహేశ్వర స్వామి ఆలయంలో..

హయత్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ శాంతినగర్‌లోని కంఠమహేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సిద్ధు పండితుడి ఆధ్వర్యంలో పుట్ట మట్టితో 365 శివ లింగాలను, భారీ సైజులో ఉమా పార్థివ శివలింగాన్ని తయారు చేశారు. అనంతరం మహాలింగార్చన నిర్వహించారు. ఉదయం మట్టి లింగాలకు ఆవాహన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఉమా పార్థివ శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు హాజరై పరమశివుడిని దర్శించుకున్నారు.



హయత్‌నగర్ శాంతినగర్‌లోని కంఠమహేశ్వర స్వామి

ప్రేమ విఫలమై బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

వనస్థలిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్‌లో నివాసముండే నగేష్‌గౌడ్ కుమారుడు సాయి నిఖిల్‌గౌడ్ (21) బీటెక్ చదువుకుంటూ వనస్థలిపురంలో చెస్ ఇనిస్టిట్యూట్ నడుపుతున్నాడు. గౌతమ్‌నగర్ డివిజన్‌లో నివాసముండే ఓ యువతిని నిఖిల్‌గౌడ్ ప్రేమించాడు. ప్రేమ విఫలం కావడంతో సోమవారం వనస్థలిపురంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత తదితరులు ఇందిరా నెహ్రూ నగర్‌కు వెళ్లి నిఖిల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నిఖిల్ (ఫైల్)